సాక్షి అనంతపురం

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



రేపు ‘స్పందన’ ఉండదు

న్యూ ఇయర్ సందర్భంగా జనవరి ఒకటో తేదీన కలెక్టరేట్‌లో ‘స్పందన’ రద్దు చేసినట్లు డీఆర్వో గాయత్రీదేవి తెలిపారు.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.3°/14.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

బీసీలిప్పుడు గుర్తొచ్చారా?

- లోకేష్‌పై హరీష్ యాదవ్ మండిపాటు



మాట్లాడుతున్న హరీష్ యాదవ్

అనంతపురం కార్పొరేషన్: ఇన్నాళ్లూ పట్టని బీసీలు ఎన్నికలు సమీపించగానే గుర్తుకొచ్చారా అంటూ టీడీపీ నేత నారా లోకేష్‌ను యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ ప్రశ్నించారు. శనివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో హరీష్ యాదవ్ విలేకరులతో మాట్లాడారు. ‘జయహో బీసీ’ కార్యక్రమం చేపడుతామని, బీసీలకు ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేస్తామని లోకేష్ చెప్పడంపై మండిపడ్డారు. బీసీల ద్రోహి టీడీపీ అని విమర్శించారు. ఓటు బ్యాంకు కోసమే బడుగు, బలహీన వర్గాలను టీడీపీ వాడుకుంటోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగున్నరేళ్ల కాలంలో బడుగులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. మంత్రివర్గంలో 25 మందికి గాను 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉన్నారన్నారు. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు బీసీలకు అవకాశం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు వస్తున్న ఆదరణ చూశాక టీడీపీ అధినేత చంద్రబాబు, తనయుడు లోకేష్ ‘బీసీల జపం’ చేస్తున్నారని విమర్శించారు. బీసీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించారని లోకేష్ ఆరోపించడం దారుణమన్నారు. చంద్రబాబు గతంలో నాయీబ్రాహ్మణులను తోక కత్తిరిస్తామని బెదిరించిన విషయాన్ని గుర్తు చేశారు. రెడ్ బుక్ పేరెత్తితే ఆ అధికారులకు ఉలుకెందుకని వ్యాఖ్యానించడం లోకేష్ దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. వారి గిమ్మిక్కులను ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. పవన్ కళ్యాణ్ సీఎం జగన్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. టీడీపీ-జనసేన పొత్తులు చిత్తయ్యే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

30 మందికి కరోనా పరీక్షలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శనివారం 30 మందికి కరోనా పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తెలిపారు. అయితే ఎవరికీ పాజిటివ్ రాలేదని స్పష్టం చేశారు.


సుస్థిరమైన అభివృద్ధి

- పేదల ఇంట సంక్షేమ వెలుగులు
- పారదర్శకతకు సర్కారు పెద్దపీట
- సామాజిక, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో ప్రగతి

విద్యాభివృద్ధికి పెద్దపీట



పేద పిల్లల చదువులకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. అమ్మ ఒడి పథకం కింద జిల్లాలో 2,13,394 మంది లబ్ధిదారులకు రూ.277.41 కోట్లు జమ చేసింది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 1,175 మంది విద్యార్థులకు ‘జగనన్న ఆణిముత్యాలు’ కింద రూ.44.66 లక్షలు అందజేసింది. జగనన్న గోరుముద్ద కింద నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తోంది. ఈ ఏడాది మొత్తం 25,02,133 పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసింది. మన బడి నాడు–నేడు కింద 1,103 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.386 కోట్లు వెచ్చించి ఆధునీకరించింది.



అనంతపురం రూరల్ మండలం ఆలమూరు లేఅవుట్‌లో నిర్మాణమవుతున్న జగనన్న ఇళ్లు

అనంతపురం : జిల్లాలో 2023వ సంవత్సరంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాల వల్ల ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. సుస్థిరమైన అభివృద్ధి జరిగింది. సామాజిక, వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్య తదితర రంగాల్లో మునుపెన్నడూ లేనివిధంగా ప్రగతి చోటుచేసుకుంది.

పేదలకు ‘సంక్షేమ’ కాంతులు

ఈ ఏడాది సంక్షేమ విప్లవం కొనసాగింది. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో బహుళార్థక రక్షిత తాగునీటి పథకాల ద్వారా జిల్లాకు రూ.115 కోట్లు ఖర్చు పెట్టారు. నవరత్నాలు –పేదలందరికీ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి తాత్కాలిక నీటి వసతికి రూ.18.82 కోట్లు ఖర్చు చేశారు. జగనన్న హౌసింగ్ కాలనీలకు ప్రాధాన్యతా క్రమంలో శాశ్వత తాగునీటి వసతికి రూ.110.94 కోట్లు కేటాయించారు. జిల్లాలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద 13,228 లబ్ధి దారులకు రూ.2.56 కోట్లతో బాలామృతం అందించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2,88,338 మందికి రూ.467.49 కోట్లు మంజూరు చేశారు. ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు కలిగిన 2,58,681 మంది కూలీలకు 75,02,471 పని దినాలు కల్పించారు. వైఎస్సార్ జలకళ కింద 30,638 మంది రైతులకు రూ.15.97 కోట్లతో బోర్లు వేశారు. మైక్రో వాటర్‌షెడ్ల కింద రూ.16.11 కోట్లతో 23,303 హెక్టార్లలో మైక్రో వాటర్‌షెడ్లు నిర్మించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం కింద 8,286 మంది చేనేత కార్మికులకు రూ.24వేల చొప్పున రూ.19.88 కోట్లు అందించారు. జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు ఏడాదికి రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణాన్ని ఈ సంవత్సరంలో 15,555 మందికి రూ.16.75 కోట్లు రుణం అందించారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఆసరా పథకం కింద మూడో విడతలో 24,098 మందికి రూ.183.56 కోట్లు అందించారు. వైఎస్సార్ చేయూత పథకం కింద 45 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.18,750 చొప్పున మూడో విడతలో 1,16,882 మందికి రూ.219.15 కోట్లు అందజేశారు. ఇక వైఎస్సార్ బీమా పథకం కింద 5,346 మంది కుటుంబాలకు రూ.87.91 కోట్ల మేర పరిహారం అందించారు.

వైద్య సేవలు మెరుగు



రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఉమ్మడి జిల్లా ప్రజలకు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రే పెద్ద దిక్కు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభంతో మరిన్ని సేవలు ప్రజలకు చేకూరాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవ తీసుకుని వైద్య సేవలు మెరుగునకు చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి రూ.30 కోట్లు నిధులు విడుదల చేయడంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏడు స్పెషాలిటీ సేవలు అందుబాటులో వచ్చాయి. రాయలసీమ ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడ సేవలు పొందుతున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రికి ‘నాడు–నేడు’ కింద ప్రభుత్వం రూ.300 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఇక్కడ సర్జికల్ బ్లాక్, ఎంసీహెచ్ బ్లాక్, పీజీ వైద్యుల హాస్టల్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ మూడు బ్లాక్‌లు ఏర్పాటైతే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, తదితరులకు నాణ్యమైన వైద్య సేవలందుతాయి.

అన్నదాతకు ‘భరోసా’



అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమానికి జగన్ సర్కారు ఇతోధిక సాయం అందించింది. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ఐదో ఏడాదికి సంబంధించి తొలివిడతగా జూన్‌లో 2,89,116 మంది రైతులకు రూ.7,500 ప్రకారం రూ.217 కోట్లు, రెండో విడత కింద అక్టోబర్‌లో 2,94,234 మంది రైతులకు రూ.4 వేలు ప్రకారం రూ.120 కోట్లు జమ చేసింది. సంక్రాంతికి మూడో విడత కింద రూ.2 వేలు చొప్పున ఇవ్వనుంది. ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద జూన్‌లో 1,40,267 మంది రైతుల ఖాతాల్లోకి రూ.211.80 కోట్లు జమ చేసింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న 5,582 హెక్టార్ల పంటలకు సంబంధించి 6,433 మందికి రూ.7.62 కోట్ల పెట్టుబడిరాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ) అందించింది. జిల్లాలోని 28 కరువు మండలాల్లో 2,35,408 మంది రైతులకు రూ.257.72 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని ప్రతిపాదనలు తయారయ్యాయి. ఖరీఫ్ పంట పెట్టుబడుల కోసం రూ.6,015 కోట్ల మేర బ్యాంకు రుణాలు రెన్యూవల్స్, కొత్త రుణాలు అందించారు. ఆత్మహత్య చేసుకున్న 41 మంది బాధిత రైతు కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున రూ.2.78 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 6,866 మంది కౌలుదారులకు గుర్తింపు కార్డులు అందించి, వారిలో 5,911 మంది రైతులకు రూ.23.76 కోట్ల పంట రుణాలు, 2,055 మందికి వైఎస్సార్ రైతు భరోసా వర్తింపజేశారు. ఖరీఫ్‌లో వేరుశనగ, రబీలో పప్పుశనగ, అలాగే ప్రత్యామ్నాయ విత్తనాలకు రూ.50 కోట్ల వరకు రాయితీ వర్తింపజేశారు. రూ.130 కోట్ల బడ్జెట్‌తో ఈ ఏడాది 12,500 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు (బిందు, తుంపర) సేద్యం పరికరాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే 90 శాతం లక్ష్యం పూర్తయింది. అలాగే ఉద్యానశాఖ పథకాలకు రూ.12.93 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మత్స్యకారులకు ఉచితంగా 40 లక్షల వరకు చేపపిల్లలు అందిస్తున్నారు. ఏళ్లుగా ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్న 1,290 మంది రైతులకు 1,759.65 ఎకరాలకు పట్టాలు మంజూరు చేశారు. భూ వివాదాలు, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష’ పథకం ద్వారా జిల్లాలో భూముల సమగ్ర రీ సర్వే కార్యక్రమం శరవేగంగా నిర్వహిస్తోంది. 31 మండలాల పరిధిలోని 503 గ్రామాల్లో 10,188.59 చదరపు కిలో మీటర్లు సర్వే చేయనున్నారు.



ప్రగతి పథంలో పారిశ్రామిక రంగం



పారిశ్రామిక రంగం ఈ ఏడాది ప్రగతిపథంలో దూసుకుపోయింది. రూ.32.26 కోట్ల పెట్టుబడితో 4,225 చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి 13,206 మందికి ఉపాధి కల్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, పవర్ వినియోగం రాయితీ, అమ్మకపు పన్ను రాయితీ ఇచ్చి 676 చిన్న పరిశ్రమలకు గాను రూ.62.19 కోట్లు ఖర్చు చేశారు. ఇండస్ట్రియల్ పాలసీ కింద 1520, వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద ఇప్పటి వరకు 49 చిన్న పరిశ్రమలకు రూ.6.44 కోట్లు మంజూరు చేశారు.

నేడు ఏహెచ్‌ఏ అభ్యర్థులకు ఎంపిక పరీక్ష

అనంతపురం అగ్రికల్చర్/ అర్బన్: పశుసంవర్ధకశాఖ సహాయకుల (అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ –ఏహెచ్‌ఏ) ఎంపిక పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ఐటీ, అనంతలక్ష్మి, పీవీకేకే, ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాల, బాలాజీ పీజీ కళాశాల, తాడిపత్రి సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాల, తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్ పద్ధతిలో 925 మంది అభ్యర్థులకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు 150 మార్కులకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పరీక్షా కేంద్రాలలోకి అనుమతి ఉంటుందన్నారు. 9.15 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని తెలిపారు.

పకడ్బందీగా నిర్వహణ

పశుసంవర్ధక సహాయకుల ఎంపిక పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించాలన్నారు.

తాడిపత్రిలో జేసీ సోదరులకు షాక్

- వ్యక్తిగత లాయర్ వైఎస్సార్‌సీపీలో చేరిక



లాయర్ శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలో జేసీ సోదరుల(దివాకర్‌రెడ్డి – ప్రభాకర్‌రెడ్డి)కు షాక్ తగిలింది. జేసీ బ్రదర్స్ వ్యక్తిగత లాయర్, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు శనివారం టీడీపీకి రాజీనామా చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లాయర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తాను రెండు దశాబ్దాలుగా జేసీ సోదరుల వద్ద వృత్తిరీత్యా పనిచేశానన్నారు. ఇటీవల కాలంలో పట్టణ అభివృద్ధికి అడ్డు తగులుతూ, ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై తప్పుడు కేసులు పెట్టాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒత్తిడి తెచ్చారన్నారు. మనస్సాక్షిని చంపుకొని పనిచేయలేక టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. పెద్దారెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం శాయశక్తులా పనిచేస్తానన్నారు.

దుస్తులు చింపుకొని హంగామా

తాడిపత్రిలో విద్యుత్ స్తంభాలకు కట్టిన వైఎస్సార్‌సీపీ జెండాలు తొలగించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హంగామా చేశారని, సానుభూతి కోసం దుస్తులు చింపుకున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. పట్టణంలో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ల కోసం దాదాపు రూ.63 కోట్ల నిధులు తెస్తే మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదించకుండా దారి మళ్లించాలని చూస్తున్నారన్నారు. మూడు నెలలుగా దాదాపు రూ.8లక్షల సొంత డబ్బుతో తాను పట్టణంలో డ్రెయినేజీ, రోడ్డు ప్యాచ్ పనులు చేయించానన్నారు. ప్రజల సమస్యలుంటే నేరుగా తనకే చెబుతున్నారన్నారు. ఇకనైనా పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్‌ను కోరారు.

నేరాలు తగ్గుముఖం

- అదుపులో శాంతిభద్రతలు
- సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం
- 2023 వార్షిక నేర సమీక్షలో ఎస్పీ అన్బురాజన్



నేర సమీక్ష గణాంకాలు వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: ఈ ఏడాది జిల్లాలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయి. పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించడమే ఇందుకు కారణం. సైబర్ మోసాలకు కూడా కళ్లెం వేశారు. సైబర్ నేరస్తుడు కింగ్ పిన్ అనయతుల్లాను కశ్మీరుకెళ్లి మరీ పట్టుకొచ్చారు. జిల్లా పోలీసు శాఖ చరిత్రలో ఈ సైబర్ క్రైం కేసు మైలురాయిలా నిలిచిపోయింది. శనివారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ 2023 వార్షిక నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కిందిస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుని జిల్లా ప్రజల సహకారంతో నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించామన్నారు. 2022 సంవత్సరంలో హత్యలు, హత్యాయత్నాలు, రైటింగ్, కిడ్నాప్, హర్ట్ కేసులు కలిపి 1,062 నమోదు కాగా, 2023 లో 915 కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు. గతేడాది డెకాయిట్, రాబరీ, రాత్రి, పగలు దొంగతనాలు, సాధారణ దొంగతనాలు కలిపి జిల్లాలో 577 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 491 నేరాలు జరిగాయని వెల్లడించారు. గత ఏడాది జరిగిన చోరీ సొత్తులో రూ.3,71,89,003 రికవరీ చేయగా.. ఈ ఏడాది రూ.7,00,45,618 రికవరీ చేసి జవాబుదారీతనంతో ప్రజలకు అప్పగించామని తెలిపారు. మహిళలకు సంబంధించిన నేరాలు స్వల్పంగా పెరిగినా పోక్సో కేసులు మూడు శాతం తగ్గాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల నేరాలు, పోక్సో కేసులు కలిపి గత ఏడాది 119 నమోదు కాగా ఈ ఏడాది 123 కేసులు నమోదు అయ్యాయన్నారు. గత ఏడాదితో పోల్చితే రోడ్డు ప్రమాదాలు 2 శాతం తగ్గాయన్నారు. గత ఏడాది 540 ప్రమాదాలు జరగగా.. ఈ ఏడాది 529 నమోదయ్యాయన్నారు.

ఆర్థిక నేరగాళ్లపై ఉక్కుపాదం

ప్రజలను నమ్మించి మోసగించే వైట్ కాలర్ నేరగాళ్ల పీచమణిచేందుకు పోలీసుశాఖ గట్టిగా పని చేయడంతో నేరాలు 28 శాతం తగ్గాయని ఎస్పీ తెలిపారు. చీటింగ్‌లు, క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్, ఫేక్ కరెన్సీ,సైబర్ నేరాలు 2022లో 497 కేసులు నమోదయ్యాయన్నారు. 2023లో 360 కేసులు నమోదయ్యాయని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా 26,868 కేసులు పరిష్కారం అయ్యేలా చూశామన్నారు. తీవ్రమైన నేరాల్లో 13 మంది ముద్దాయిలకు శిక్ష పడేలా పోలీసులు సమర్థవంతంగా పనిచేశారన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లో గుట్కా, గేమింగ్ యాక్ట్ కేసులు 2022లో 2,586 నమోదు కాగా 2023 లో 2,542 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

దేశ సరిహద్దులు దాటి..

- సైబర్ నేరగాళ్ల ముఠా నాయకుడు, సైబర్ క్రైంలో కింగ్ పిన్ అయిన అనయతుల్లాను అరెస్ట్ చేయడానికి ‘అనంత’ పోలీసులు దేశ సరిహద్దుల్లో మార్క్ చూపించారన్నారు. కింగ్ పిన్ పర్వాన్‌ను జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో అరెస్టు చేయడం విశేషమన్నారు.
- ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు ‘చాట్ బాట్’ సేవల ద్వారా రూ. 3.57 కోట్ల విలువ చేసే 8,063 మొబైల్ ఫోన్లను బాధిత ప్రజలకు అప్పగించామన్నారు.
- శాంతిభద్రతలకు తలనొప్పిగా మారిన 11 మందిపై బహిష్కరణ వేటు వేశామన్నారు.
- జిల్లాలో గత ఏడాది అన్ని నేరాలు కలిపి 8,763 నమోదు కాగా.. ఈ ఏడాది 8,599 నమోదయ్యాయన్నారు.
- శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేసినందుకు అనంతపురం డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డితో పాటు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌లకు డీజీపీ కమాండేషన్ డిస్క్ అవార్డులు వరించాయి.
- జిల్లాలో పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు ఎస్పీ తెలిపారు.
- జిల్లా పోలీసులు, సెబ్ విభాగం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి కర్ణాటక లిక్కర్, నాటుసారా అక్రమ దిగుమతులకు అడ్డుకట్ట వేశారని ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది మొత్తం 1,567 కేసులు నమోదు చేసి 1,695 మందిని అరెస్టు చేశారన్నారు. 2024లో కూడా జిల్లా పోలీసు శాఖ ఇదే స్ఫూర్తితో పనిచేస్తుందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టామన్నారు. శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి


మృతుడు హుస్సేన్

గుత్తి: విద్యుత్ షాక్‌తో కూలీ మృతి చెందిన ఘటన పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో చోటుచేసుకుంది. వివరాలు.. గుంతకల్లు మండలం వైటీ చెరువు గ్రామానికి చెందిన హుస్సేన్ (40) కొంత కాలంగా గుత్తి ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తున్నాడు. శనివారం హైడ్రాలిక్ మిషన్‌తో ఇటుకలు తయారు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు, ఫ్యాక్టరీ నిర్వాహకులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే హుస్సేన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వృద్ధుడి మృత్యువాత

తాడిపత్రిటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని వృద్ధుడు మృత్యువాత పడిన ఘటన మండలంలోని గంగాదేవిపల్లె వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి-యాడికి ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న గ్రామానికి చెందిన పెద్ద కంబగిరి (60)ని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. తీవ్రగాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య నీలమ్మ ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆదర్శ గురుకులం


పాఠశాల ఆవరణలో ఆకుకూరల పెంపకాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సంగీతకుమారి

పాఠశాలలోకి అడుగుపెట్టగానే పరిశుభ్రమైన వాతావరణం స్వాగతం పలుకుతుంది. పచ్చని మొక్కలు పలకరిస్తాయి. తరగతి గదుల గోడలపై రాసిన 'కొటేషన్లు' ఆకట్టుకుంటాయి. దేశ నాయకుల చిత్రాలు వారి త్యాగాలను, ఘనతను గుర్తుకు తెస్తాయి. విద్యార్థినుల క్రమశిక్షణ ముచ్చటగొల్పుతుంది. మొత్తంగా అక్కడి వాతావరణం అలనాటి 'గురుకులాన్ని' తలపిస్తుంది.

- ప్రత్యేకత చాటుకుంటున్న 'ఈస్ట్ నరసాపురం గురుకుల పాఠశాల'
- ఆహ్లాదకర వాతావరణం, అత్యుత్తమ బోధనా ప్రమాణాలు
- విద్యార్థినుల సమగ్ర వికాసానికి కృషి
- ప్రిన్సిపాల్ చొరవతో నందనవనంగా విద్యానిలయం

సాక్షి, అనంతపురం డెస్క్: 'ఈస్ట్ నరసాపురం' మహాత్మాజ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ప్రారంభించిన అనతికాలంలోనే చక్కటి విద్యానిలయంగా గుర్తింపు తెచ్చుకుంది. ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవ, ప్రభుత్వం, దాతల సహకారంతో కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా పాఠశాలను తీర్చిదిద్దారు. 2022 జనవరి 24న ఈ పాఠశాలను ప్రారంభించారు. 5 నుంచి 10వ తరగతి వరకు 340 మంది విద్యార్థినులు చదువుతున్నారు. శింగనమల మండలం ఈస్ట్ నరసాపురం వద్ద శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. ప్రస్తుతం పాఠశాలను నార్పల మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ భవనం ఇంతకుముందు నిరుపయోగంగా ఉండేది. గురుకుల పాఠశాలను ప్రారంభించిన తర్వాత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవ

'ఈస్ట్ నరసాపురం' గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా కె.సంగీత కుమారి ఉన్నారు. ఈమె జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్‌గానూ వ్యవహరిస్తున్నారు. పాఠశాలను తాత్కాలిక భవనాల్లో ప్రారంభించినప్పటికీ ప్రత్యేక శ్రద్ధతో ఆదర్శవంతమైన విద్యానిలయంగా తీర్చిదిద్దారు. పాఠశాల సమీపంలోనే నివాసముంటూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పాఠశాల అభివృద్ధిలో సిబ్బందిని, విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను భాగస్వామ్యం చేశారు. మూడు నెలలకు ఒకసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నారు. చిన్నచిన్న మరమ్మతులు, ఇతరత్రా అభివృద్ధి పనులకు వారి సహకారం కోరుతున్నారు. విద్యార్థినుల తల్లిదండ్రుల్లో ఎవరైనా వృత్తినిపుణులు ఉంటే వారి సేవలనూ వినియోగించుకుంటున్నారు. ఆర్డీటీ, డిస్కవరీ అనంత, ఆలూరి ఫౌండేషన్ తదితర సంస్థలు, దాతల సహకారంతో పాఠశాలకు సీసీ కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, క్రీడా పరికరాలు, మినరల్ వాటర్‌ప్లాంట్ లాంటి సౌకర్యాలను సమకూర్చారు.

విద్యతో పాటు అదనపు నైపుణ్యాలు

కేవలం చదువు ఉంటేనే సరిపోదు. జీవితంలో పైకి రావాలంటే అదనపు నైపుణ్యాలు కూడా అవసరం. అందువల్లే 'ఈస్ట్ నరసాపురం' గురుకుల పాఠశాల విద్యార్థినులకు చదువుతో పాటు అదనపు నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. ప్రతి విద్యార్థినికీ ప్రత్యేక ఫైలు, తరగతి గదిలో ఓ బాక్సు ఏర్పాటు చేశారు. వారికి సంబంధించిన మార్కులు, ఇతరత్రా వివరాలన్నీ అందులో ఉంటాయి. తల్లిదండ్రులు ఎప్పుడైనా పరిశీలించుకుని..తమ పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవచ్చు. కొత్త పాఠశాల అయినప్పటికీ ఎన్‌సీసీ యూనిట్ కూడా ప్రారంభించారు. 50 మంది విద్యార్థినులు ఎన్‌సీసీ శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల వినియోగంలో ఇక్కడి విద్యార్థినులు ముందున్నారు. జూడో, హాకీ, క్రికెట్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బేస్‌బాల్ వంటి క్రీడల్లో రాణిస్తున్నారు. చిత్రలేఖనంలోనూ ప్రోత్సహిస్తుండడంతో పోటీపడి మరీ చిత్రాలు గీస్తున్నారు. వారు వేసిన చిత్రాలను పాఠశాలలో ప్రదర్శనకు పెడుతూ మరింత ఉత్సాహాన్ని నింపుతున్నారు. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి క్రమశిక్షణ, జీవన నైపుణ్యాలు నేర్పుతున్నారు. సెక్షన్ల వారీగా తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి.. పిల్లల ప్రగతిని షేర్ చేస్తున్నారు. స్కూల్‌కు సంబంధించి యూట్యూబ్ చానెల్ (ఎంజేపీ నార్పల) నిర్వహిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న గార్డెనింగ్

గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఖాళీ స్థలాన్ని వృథాగా వదిలేయకుండా వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. కూరలకు వీటినే వినియోగిస్తున్నారు. ప్రయోగాత్మకంగా వర్మీకంపోస్టు తయారీ కూడా ప్రారంభించారు. మొత్తమ్మీద అన్ని విషయాల్లోనూ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. పిల్లలు మంచి వాతావరణంలో చదువుకుంటుండడంతో తల్లిదండ్రుల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది.

కిచెన్ గార్డెన్ ప్రత్యేకం



మా స్కూల్‌లో కిచెన్ గార్డెన్ ప్రత్యేకంగా నిలుస్తోంది. దాదాపు అన్ని రకాల ఆకుకూరలూ మేమే పండిస్తున్నాం. ఎటువంటి రసాయనాలూ వాడని ఆకుకూరలు వినియోగించడం వల్ల మా ఆరోగ్యం బాగుంటోంది. ఇక్కడి వాతావరణం అద్భుతంగా ఉంది. మమ్మల్ని చదువులోనే కాదు.. ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్‌లోనూ ప్రోత్సహిస్తున్నారు.

– ఎం.సబిత, తొమ్మిదో తరగతి

సౌకర్యాలు బాగున్నాయి



మా స్కూల్లో సౌకర్యాలు బాగున్నాయి. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ ట్రైనింగ్, డిజిటల్ క్లాసెస్, లైబ్రరీ, ల్యాబ్ ఇలా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రిన్సిపాల్ మేడం మమ్మల్ని సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు. ఇక్కడ చదువుకుంటున్నందుకు అదృష్టంగా భావిస్తున్నాం.

– ఆర్.తనుష్య, తొమ్మిదో తరగతి

నైతిక విలువలకు పెద్దపీట



విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అందుకు తగ్గట్టు మేము కూడా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం. పిల్లలకు కేవలం చదువు చెప్పడమే కాదు..పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా తీర్చిదిద్దుతున్నాం. ముఖ్యంగా నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పుతున్నాం. రేపు వారు ధైర్యంగా జీవించాలి.. సమాజానికి, దేశానికి ఉపయోగపడాలన్నదే మా తపన. ఇక పాఠశాల అభివృద్ధిలో ప్రభుత్వం, దాతలు, విద్యార్థినుల తల్లిదండ్రుల సహకారం మరువలేనిది.

–కె.సంగీత కుమారి, ప్రిన్సిపాల్, 'ఈస్ట్ నరసాపురం గురుకుల పాఠశాల'


నార్పలలోని గురుకుల బాలికల పాఠశాల భవనం


పాఠశాల భవనం నమూనా తయారు చేస్తున్న విద్యార్థినులు


జూడో శిక్షణ తీసుకుంటూ..

న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

- కేక్ కటింగ్, చిందులేయడం సరి కాదు
- పార్టీలకు అనుమతి తప్పనిసరి
- జిల్లా వ్యాప్తంగా రాత్రంతా డ్రంకన్ డ్రైవ్
- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: జిల్లా ప్రజలకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుభాకాంక్షలు తెలిపారు. న్యూ ఇయర్ వేడుక పేరుతో యువత రోడ్లపైకొచ్చి మద్యం మత్తులో చిందులేసి జన జీవనానికి ఇబ్బంది కలిగిస్తే మాత్రం పోలీసులు తాట తీస్తారని హెచ్చరించారు. శనివారం వార్షిక నేరసమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జనజీవనానికి ఇబ్బంది పెట్టే వారెవరైనా ఉపేక్షించేది లేదన్నారు. రోడ్లపై కేక్ కటింగ్‌లు, బాణసంచా పేల్చడంలాంటి చర్యలకు దిగితే పోలీసులు తమ పని తాము చేసుకుపోతారన్నారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 31వ తేదీ డ్రంకన్‌డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీల పేరుతో పెద్ద పెద్ద శబ్దాలు చేసే పాటలు, డీజేలు పెట్టుకోవద్దన్నారు. యువత న్యూ ఇయర్ పేరుతో హంగామా చేయాలని బైక్‌లతో రహదారులపైకి రావద్దని చెప్పారు. తల్లిదండ్రులు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించరాదని సూచించారు. పిల్లలు తాగి బైక్‌లపై వెళ్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి కుటుంబం వారి పిల్లల పట్ల కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల మద్యం కూడా దిగుమతి కాకుండా రాష్ట్ర సరిహద్దులతో పాటు 19 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి చోటా పోలీసులు తనిఖీలు చేపడతారని తెలిపారు. ప్రత్యేక బృందాలు మొబైల్ టీంలుగా విడిపోయి తిరుగుతాయన్నారు. పోలీసులకు జిల్లా ప్రజలు సహకరించాలన్నారు. ఇక బార్లు, మద్యం దుకాణాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయపాలన పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బార్లు నిర్వహిస్తే వాటి నిర్వాహకులపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి 2009లో సక్సెస్ స్కూళ్లు ఏర్పాటు చేసి ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చి ఏకంగా 36 వేలమంది టీచర్లకు పదోన్నతులు కల్పించారని గుర్తు చేశారు. 1995, 96, 98 డీఎస్సీ టీచర్లకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టి, నాడు- నేడు కార్యక్రమం పేరుతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి. అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ టీచర్లకు సంబంధించి అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎస్. నాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న తెలుగు, హిందీ పండిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల సమస్యలను పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కె.గోవిందరెడ్డి, పి.రవీంద్రరెడ్డి, రాధాకృష్ణరెడ్డి, జిల్లా నాయకులు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడా విజేత ఏఆర్ జట్టు

- ట్రోఫీలు ప్రదానం చేసిన డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్
- క్రీడాస్ఫూర్తిని విధుల్లోనూ చూపాలని పిలుపు


విజేత జట్టుతో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-23 విజేతగా ఏఆర్ జట్టు నిలిచింది. శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. డీఐజీ ఆర్‌ఎస్ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టగ్ ఆఫ్ వార్, స్పీడ్ వాక్ పోటీల్లో వారు పాల్గొని క్రీడాకారుల్లో ఉత్తేజం నింపారు. డీఐజీ, ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది దేహదారుఢ్యం కలిగి ఉండటం చాలా ముఖ్యమన్నారు. భేషజాలు వీడి క్రీడల్లో పాల్గొనడం వల్ల స్నేహపూర్వక సంబంధాలు మెరుగవుతాయన్నారు. సమష్టిగా శ్రమించే తత్వం అలవడుతుందన్నారు. ఎన్నికల వేళ విధులు సవాల్‌తో కూడుకుని ఉంటాయన్నారు. క్రీడా స్ఫూర్తిని విధుల్లోనూ చూపియన్నారు. అధికారులు, సిబ్బంది చక్కటి సమన్వయంతో మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడలు, ఆటల్లో మొదటి, రెండు, మూడవ స్థానాల్లో నిలిచిన జట్లకు, క్రీడాకారులకు పతకాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయ భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, డీఎస్పీలు ఆంథోనప్ప, శ్రీనివాసులు, సీఎం గంగయ్య, ప్రసాదరెడ్డి, టీవీ శివారెడ్డి, ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్, సీఐలు శివరాముడు, దేవానంద్, శంకర్‌రెడ్డి, తిమ్మయ్య, వెంకటేష్ నాయక్, ఆర్‌ఐలు హరికృష్ణ, రాముడు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పలువురు ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలతో పాటు జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులనాయుడు, శివప్రసాద్, రమణ, సరోజ, రమణ, తదితరులున్నారు.

తరగని ఆస్తి.. మీరే స్ఫూర్తి

కుందుర్పి: మండలంలోని బసాపురం గ్రామంలో శనివారం వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు లెనిన్‌బాబు మాట్లాడుతూ అవ్వాతాతల ప్రాధాన్యతను చాటి చెప్పారు. మన పుట్టుకకు కారణమైన వారి బాగోగులు చూడడం బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


అవ్వాతాతలకు పాదాభివందనం చేస్తున్న చిన్నారులు

విద్యార్థుల్లో సేవాదృక్పథం పెంచాలి

అనంతపురం అర్బన్: విద్యార్థుల్లో సేవాదృక్పథం పెంచాలని డీఆర్‌ఓ గాయత్రిదేవి స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సంఘం సర్వసభ్య సమావేశానికి డీఆర్‌ఓతో పాటు డీఈఓ నాగరాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నూతన కమిటీని డీఆర్‌ఓ సమక్షంలో ఎన్నుకుని ఆమోదం తీసుకున్నారు. మధ్యప్రదేశ్‌లో హిమాలయ ఉడ్ బ్యాడ్జ్ కోర్సు పూర్తి చేసిన ముగ్గురికి డీఆర్‌ఓ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

జిల్లా నూతన కార్యవర్గం ఇదే.. : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంఘం అధ్యక్షులుగా కలెక్టర్ గౌతమి, ఉపాధ్యక్షులుగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి, జిల్లా చీఫ్ కమిషనర్‌గా డీఈఓ నాగరాజును ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా బి.బొమ్మయ్య (లీడర్ ట్రైనర్), కోశాధికారిగా ఎం.హిమగిరివరప్రసాద్‌ను ఎన్నికయ్యారు. జిల్లా ట్రైనీ కమిషనర్‌గా (స్కౌట్స్) బి.విజయకుమార్, జిల్లా ట్రైనీ కమిషనర్‌గా (గైడ్స్) కె.ఆదిలక్ష్మీబాయి, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్‌గా (స్కౌట్స్) కె.లక్ష్మన్న, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్‌గా (గైడ్స్) పి.శైలజను ఎన్నుకున్నారు.

కుమార్తెకు పెళ్లయిన రెండు రోజులకే తండ్రి దుర్మరణం


మృతి చెందిన ఆంజనేయులు

రామగిరి: కుమార్తెకు పెళ్లి చేసిన రెండు రోజులకే రోడ్డు ప్రమాద రూపంలో ఓ తండ్రిని మృత్యువు కబళించింది. ఎంతో ఆనందంగా ఉన్న పెళ్లింట విషాదం నింపింది. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని గంతిమర్రి గ్రామానికి చెందిన ఆంజనేయులు (47), పోతక్క దంపతులు. రెండు రోజుల క్రితం కర్నూలు జిల్లా ప్యాపిలికి చెందిన ఓ వ్యక్తితో వీరి పెద్ద కుమార్తెకు వివాహం జరిగింది. పెళ్లి సజావుగా సాగడంతో ఆ కుటుంబం సంతోషంలో మునిగితేలింది. ఈ క్రమంలోనే శనివారం వ్యక్తిగత పని నిమిత్తం ఆంజనేయులు ద్విచక్రవాహనంలో ఎన్‌ఎస్‌గేట్‌కు వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో శ్రీహరిపురం గ్రామ సమీపంలో ఎదురుగా బొలెరో వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన ఆయనను 108 ద్వారా అనంతపురం తరలిస్తుండగా, మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెకు రెండు రోజుల క్రితం వివాహమైంది. ఈ క్రమంలోనే ఇంటి పెద్ద దిక్కు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడిగా శంకరయ్య

అనంతపురం క్రైం: రాయలసీమ బలిజ మహా సంఘం నూతన అధ్యక్షుడిగా తొండపునాటి శంకరయ్య ఎన్నికయ్యారు. స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని కల్యాణమండపంలో శనివారం కమిటీ సభ్యులు నూతన అధ్యక్షుడిని తాత్కాలికంగా ఎన్నుకున్నారు. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం మాజీ అధ్యక్షుడు పాములాయి వెంకటేష్ మాట్లాడుతూ రెండున్నరేళ్ల పాటు తనకు సహకరించిన ప్రతి సభ్యుడికి, బలిజ కులస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ బలిజల అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో అన్ని పార్టీలకు చెందిన కుల పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తరఫున గ్రూప్-1, గ్రూప్-2 ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ తెలిపారు. వర్సిటీ స్టడీ సెల్‌లో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల నుద్దేశించి ఆయన శనివారం మాట్లాడారు. స్టడీ హాల్‌లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యాలను ఆరా తీశారు. వర్సిటీ అందిస్తున్న ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. స్టడీ హాల్‌లో నాన్‌బోర్డర్లు చదువుకోవచ్చని, అయితే హాస్టళ్లలో అనుమతి ఉండదని స్పష్టం చేశారు. వర్సిటీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. వర్సిటీ విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం: స్థానిక నాల్గో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో షేక్ రిజ్వానా అనే యువతి అదృశ్యమైంది. ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి మహబూబ్‌బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తి మార్గమే ఉత్తమ జీవితానికి సోపానం



మాట్లాడుతున్న ఆత్మవిదానంద సరస్వతి

అనంతపురం కల్చరల్: భక్తి మార్గం మనిషిని ఉన్నతుడిని చేసి, ఉత్తమ జీవన విధానాన్ని ప్రాప్తింపజేస్తుందని చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. స్థానిక మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో భగవాన్ రమణ మహర్షి జయంతి సందర్భంగా ఆధ్యాత్మిక సమావేశం జరిగింది. అనంత ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షులు పాల సముద్ర నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి స్వామి ఆత్మవిదానంద సరస్వతి హాజరై రమణ మహర్షుల జీవిత విశేషాలను తెలియజేశారు.సాయిట్రస్టు ఆధ్వర్యంలో భగవాన్ రమణ మహర్షి జయంతి సందర్భంగా హరిహర ఆలయంలో అన్నదానం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, నెహ్రూ యువకేంద్రం డీడీవో శ్రీనివాసులు, విజయ్‌సాయికుమార్ హాజరై మాలధారులకు భిక్ష అందించారు.

ప్రజారోగ్య రక్షణే లక్ష్యం

రాప్తాడు: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఆరోగ్య సమస్యలున్న వారికి జనవరి 2 నుంచి మార్చి 19 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష-2 మెడికల్ క్యాంపులు నిర్వహించి, వారికి వైద్య సేవలు అందిస్తామన్నారు. 2న ఎం.బండమీదపల్లి బొమ్మేపర్తి గ్రామ సచివాలయ పరిధిలో, 12న హంపాపురం, 19న గొందిరెడ్డిపల్లి, 23న మరూరు-2, ఫిబ్రవరి 2న మరూరు-3, 6న రాప్తాడు-2, 16న మరూరు-4, 20న బొమ్మేపర్తి, మార్చి-1న మరూరు-1, 5న పాలచెర్ల-1, 15న పాలచెర్ల-2, 19న గాండ్లపర్తి గ్రామా సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంపులు జరుగుతాయన్నారు.

నైతిక విలువలు అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: నైతిక విలువలు పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురంలో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మానవీయ విలువలతో కూడిన విద్య' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డి. భావన (ఈసీఈ విభాగం) మొదటి స్థానం, జెబా కౌసర్ (కెమికల్) రెండో స్థానం, జాహ్నవి (కెమికల్ విభాగం మూడో స్థానం దక్కించుకున్నారు. వీరిని వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన , రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ అభినందించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ రమణా రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.మమత, పీఆర్వో డాక్టర్ రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ఆత్మకూరు: సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. శనివారం సింగంపల్లి , పంపనూరు , సింగంపల్లి తండా గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఎంఈఓ నరసింహారెడ్డి, సింగంపల్లితండా సర్పంచ్ వెంకటేష్ నాయక్, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



షటిల్ ఆడుతున్న కార్పొరేటర్లు



ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



కబడ్డీ ఆడుతున్న మహిళలు

ప్రతిభను గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్రా

అనంతపురం: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారని మేయర్ వసీం అన్నారు. శనివారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఇండోర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన షటిల్ టోర్నీలో నగర మేయర్ వసీం పాల్గొన్నారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, ఇషాక్, అనిల్ కుమార్ రెడ్డి, క్రీడాకారులు మున్నా, జకీర్, అరాఫత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.





షటిల్ ఆడుతున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు , క్రికెట్ ఆడుతున్న 42వ సచివాలయ సిబ్బంది

సాధికార బస్సుయాత్ర విజయవంతం

- ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం అయ్యిందని, విజయ భాగస్వాములైన ప్రతి కార్యకర్త, నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేకంగా శనివారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. అనంతపురం నియోజకవర్గంలోని 50 డివిజన్లు, నారాయణపురం, రుద్రంపేట, అనంతపురం రూరల్, రాజీవ్‌కాలనీ పంచాయతీల నుంచి బస్సు యాత్ర, బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి, దిగ్విజయం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అన్ని విధాల అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుందన్నారు. దీన్ని ప్రజలు విశ్వసించారన్నారు. అందుకే ఆ స్థాయిలో బస్సుయాత్ర విజయవంతం జరిగిందన్నారు. గత టీడీపీ పాలన కంటే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగరం నలుదిక్కులా అభివృద్ధి జరిగిందన్నారు. రూ.800 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వచ్చే నెల జనవరి నుంచి పింఛన్ రూ.3 వేలు ప్రభుత్వం అందించనుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ మొత్తాన్ని పెంచుతూ వెళ్లారన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడండి

అనంతపురం కార్పొరేషన్: కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించారని, ప్రస్తుతం కోవిడ్‌కేసులు నమోదవుతున్న తరుణంలో సమ్మె విరమించి, ప్రజారోగ్యానికి పాటుపడాలని మేయర్ వసీం కార్మికులకు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. మేయర్ శనివారం కార్మికులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని, కార్మికులు ఎప్పుడు సమస్య తీసుకొచ్చినా పాలకవర్గం సహకరించిందన్నారు. కొన్ని రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోవిడ్ సమయంలో అదనంగా తీసుకున్న 70 మంది కార్మికులను కొనసాగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో కార్మికులకు రేషన్‌కార్డులను మంజూరయ్యాయన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించామన్నారు. మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారంపై ఇప్పటికే మంత్రితో ఎమ్మెల్యే మాట్లాడారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి కార్మికుల సమస్యలను తీసుకెళ్తారన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు కూడా కార్మికులు సహకరించడం అభినందనీయమన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాకు చెందిన విభిన్న ప్రతిభావంతులు ప్యారా ఒలంపిక్స్‌లో అంతర్జాతీయ స్థాయి పథకాలను సాధించాలని సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు ఆకాంక్షించారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన 6వ సీనియర్ ప్యారా వలంపిక్స్ క్రీడల్లో జిల్లాకు చెందిన పలువురు విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులు పాల్గొని పథకాలను సాధించడంపై ఆయన అభినందించారు. శనివారం స్థానిక అశోక్ నగర్ లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు పథకాలు పంపిణీ చేశారు. జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి నరసింహారెడ్డి, విభిన్న ప్రతిభవంతుల శాఖ ఏడీ రసూల్, సమగ్ర శిక్ష ఐడి కోఆర్డినేటర్ షమ, ప్యారా ఒలంపిక్స్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సమగ్ర శిక్ష సీఎంఓ గోపాల్, అలెస్కో గోవిందరెడ్డి, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓ చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయిలో విజేతలతో సమగ్ర శిక్ష ఏపీసీ, అధికారులు

అనంత సీనియర్ జర్నలిస్టుకు రాష్ట్రస్థాయి బహుమతి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గాజుల నాగభూషణంకు రాష్ట్రస్థాయి బహుమతి దక్కింది. భీమవరానికి చెందిన డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆరో పీఠాధిపతి బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ అలీషా వర్ధంతి సందర్భంగా 'స్వర్గమాత' కావ్యంపై వ్యాసరచన పోటీలు పెట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేయగా, అనంతవాసి గాజుల నాగభూషణం తృతీయ స్థానంలో నిలిచారు. వచ్చేనెల 23న భీమవరంలోని త్యాగరాజ భవన్‌లో జరిగే పురస్కార ప్రదానోత్సవంలో ఆయన అవార్డు అందుకుంటారు. సంస్థ కార్యాలయంలో నాగభూషణంను డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా అధ్యక్షుడు పండిట్ రియాజుద్దీన్ శనివారం అభినందించారు.



నాగభూషణంను అభినందిస్తున్న పండిట్ రియాజుద్దీన్

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆత్మకూరు: మండలంలోని నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి చేస్తున్నారు. జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కొళాయి అందిస్తున్నారు. ఇందులో భాగంగా మండలానికి రూ.36 కోట్లతో కూడేరు మండలం పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు వరకు 21.50 కిలో మీటర్ల మేర పైప్‌లైన్లతో నీరు అందించనున్నారు. జనవరి మొదటి వారంలో పనులు ప్రారంభం అవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలియజేశారు. మండలానికి నీరు అందించేందుకు కూడేరు మండలంనారాయణపురం వద్ద 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపు నిర్మించనున్నారు. ఆత్మకూరులోనూ ట్యాంకులు, సంపు ఏర్పాటు చేయనున్నారు. రోజుకు 1.60 కోట్ల లీటర్ల నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

శ్రీకాళహస్తికి వెళ్లిన అధికారులు.. : పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎస్ఈ ఇషాన్ బాషా, ఏఈఈ హరికుమార్, సిబ్బంది కలిసి శ్రీకాళహస్తికి వెళ్లారు. 21.50 కిలో మీటర్లకు ఎన్ని పైపులు కావాలన్న విషయాలను పరిశీలించారు. మొత్తం 1,400 పైపులు అవసరమని అధికారులు తెలిపారు.



శ్రీకాళహస్తిలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

వైఎస్సార్‌సీపీ జెండా మళ్లీ ఎగురవేద్దాం





రామగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సమావేశానికి హాజరైన నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను మళ్లీ ఎగురవేద్దామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇస్తామని చెప్పి, తన కొడుకు లోకేష్‌కు తప్ప.. ఎవరికీ ఇవ్వలేదన్నారు. అధికారంకోసం రైతుల రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ ఇలా ఎన్నో హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఇలాంటి కపట మోసగాళ్లు ఎన్నికలు రాగానే మళ్లీ ప్రజల్లోకి వస్తారన్నారు. గ్రామాల్లోకి వస్తే వాళ్లను నమ్మకండని, మీరేం చేశారని నిలదీయాలన్నారు. ఈప్రాంతంలో కొన్నేళ్లుగా పరిటాల కుటుంబ సభ్యులే మంత్రి పదవులు, ఎమ్మెల్యేలుగా కొనసాగారని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని విస్మరించి, దోచుకొని, దాచుకోవడమే పనిగాపెట్టుకున్నారన్నారు. అధికారులను బెదిరించి, చేయని పనులకు బిల్లు చేసుకున్నారన్నారు.

కపట మోసగాళ్లు చంద్రబాబు, పవన్, సునీతను నమ్మకండి ..

కొన్నేళ్లుగా పరిటాల కుటుంబ కబంద హస్తాల్లో ఉన్న ముత్యాలమ్మ గుడిని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకురావడమేకాక, త్వరలోనే రామగిరి బంగారు గనులను తెరిపించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో పవన్‌కళ్యాణ్ అనే నటుడు చంద్రబాబును గెలుపించుకునేందుకే తిరుగుతున్నాడన్నారు.లోకేష్, ఆయన ఎప్పటికీ లీడర్లు కాలేరని, చంద్రబాబు అస్తమిస్తున్న సూర్యుడని, వారికి ఇవే చివరి ఎన్నికలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు.టీడీపీతో ప్రజలు విసిగిపోయి, వైఎస్సార్‌సీపీకి పట్టంకట్టారని, తాము అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీరు తీసుకురావడంతోపాటు, అన్ని చెరువులకూ నీరు అందించినట్లు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో రాప్తాడుతోపాటు రామగిరిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని, మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ గోసే నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ ముత్యాలు, సర్పంచ్‌లు మీనుగ నాగరాజు, నరేంద్ర, రాజేష్, సిద్దన్న, చెన్నకేశరెడ్డి, ఓబిరెడ్డి, రామ్మూర్తి, నాయకులు నరసింహారెడ్డి, ఆదిరెడ్డి, మల్లికార్జున, వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

అనంతపురం ఎడ్యుకేషన్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. శనివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ 2024 క్యాలెండర్, డైరీని గిరిజమ్మ, డీఈఓ నాగరాజు, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు హాజరై ఆవిష్కరించారు. ఏపీటీఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాయకులు హనుమన్న, వెంకటేశులు, ప్రభాకర్, బొమ్మయ్య, సర్దార్‌వలి, చెన్నకేశవ, బాల రామ్మోహన్ పాల్గొన్నారు.

ఏడీపీఎస్ఏ కేలండర్ ఆవిష్కరణ

అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (ఏడీపీఎస్ఏ) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను డీఈఓ నాగరాజు తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగాధర్, అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, కోశాధికారి రామచంద్ర, సీఆర్ఓ కోటిరెడ్డి రవిచంద్ర రెడ్డి , సభ్యులు రామాంజనేయులు, నరేంద్ర, విజయకుమార్, వినోద్, రఫీ, నారాయణ, కార్యాలయ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య సేవలు

రాప్తాడు: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తోందని డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష-1కు సంబంధించిన రిపోర్ట్స్, రికార్డ్స్, రెఫరల్స్ గురించి వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి విడత ఆరోగ్య సురక్ష క్యాంపులు విజయవంతమయ్యాయని, రెండో విడత వచ్చేనెల 2 నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ, ఫార్మాసిస్ట్ మూర్తి, స్టాఫ్‌నర్సు లక్ష్మి, ఏఎన్‌ఎం లీలావతి పాల్గొన్నారు.



రాప్తాడులో పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీపీఎంఓ రవిశంకర్

ఉద్యోగ విరమణ తప్పనిసరి

అనంతపురం: ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి అని, వారు చేసిన సేవలతోనే గుర్తింపు వస్తుందని ఎస్కేయూ బోధనేతర సంఘం అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి అన్నారు. ఎస్కేయూలో అటెండర్‌గా పనిచేసిన ఎం. నాగరాజు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. బోధనేతర సంఘం ఆధ్వర్యంలో నాగరాజు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బోధనేతర సంఘం కార్యదర్శి పి. లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శివశంకర్, కోశాధికారి కవిరాజు, డాక్టర్ కే ఆనంద్ పాల్గొన్నారు.



నాగరాజు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఇద్దరికి షోకాజ్ నోటీసులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ వర్సిటీ సెంట్రల్ లైబ్రరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇద్దరు ఉద్యోగులు హాజరుపట్టికలో సంతకాలు చేసి విధులకు గైర్హాజరయినట్లు గుర్తించారు. వెంటనే వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఉన్నతాధికారులను వీసీ ఆదేశించారు.

డీసీసీబీ క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) తరఫున 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను చైర్‌పర్సన్ లిఖిత ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వై.జనార్దన్‌రెడ్డి, ఈశ్వర రెడ్డి, శంకర్‌రెడ్డి, కారుణ్య, హైదర్‌వలి, అబ్దుల్ రఫీబ్, సీఈఓ రామ్‌ప్రసాద్, డీజీఎంలు సుఖదేవబాబు, సి.రవికుమార్, డీపీడీఎం తేజశ్విని పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్, డైరీని శనివారం అనంతపురం సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి.సూర్యుడు, ప్రధాన కార్యదర్శి ఎన్. రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు రామాంజనేయులు, శివయ్య చారి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, నాగభూషణ, సురేష్, జిల్లా కార్యదర్శి చలపతి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆరోగ్యశాఖ సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి ఆదేశించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎంపీహెచ్‌ఈఓ, సీహెచ్‌ఓ అసోసియేషన్లకు చెందిన 2024 క్యాలెండర్లను డీఎంహెచ్‌ఓ ఆవిష్కరించారు. ఎంపీహెచ్‌ఈఓ, సీహెచ్‌ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, రాష్ట్ర సహ అధ్యక్షుడు జే రాజశేఖర్, కోశాధికారి టీ బాలాజీ రావు, సహాధ్యక్షులు జే కళావతి, హేమలత, లోక్‌నాథ్, నాగేశ్వరయ్య, కంబగిరి స్వామి, జయరాం నాయక్ పాల్గొన్నారు.

ఆనందం...విషాదం కాకూడదు

రాప్తాడురూరల్: నూతన సంవత్సర వేడుకల ఆనందం...విషాదం కాకూడదని అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని ప్రజలు శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఆనందోత్సాహాలతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వినోదం పేరుతో మద్యం మత్తులో చిందులేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం రాత్రి 10 గంటల తర్వాత ప్రజల గుంపులుగా తిరగడంగానీ, ఒకే ప్రదేశంలో ఎక్కువ మంది గుమికూడి ఉండకూడదన్నారు. 10 గంటల తర్వాత బార్లు, హోటల్స్, రెస్టారెంట్లు, టీ అంగళ్లు మూసివేయాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రాప్తాడు: నూతన సంవత్సర వేడకల సందర్భంగా డిసెంబరు 31న రాత్రి ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ నిర్వహించే వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన మండల ప్రజలకు సూచించా రు. మండలంలో 20 చెక్ పోస్టలను ఏర్పాటు చేసి, 31న రాత్రి 8 గంటల నుంచి జనవరి 1వ తేదీ ఉదయం 4 గంటల వరకు మద్యం సేవించి, వాహనాలు నడిపేవారిని బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీ ఉంటాయన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.5లక్షల చెక్కును స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది శనివారం అందించారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన సాకే నాగేశ్వరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ. 5 లక్షలు మంజూరైంది. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి, వైస్ సర్పంచ్ మాధవరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కవిత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ముస్తఫా, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, వెంకటేష్‌నాయక్, డీలర్ రఫి పాల్గొన్నారు.